పేదల అభ్యున్నతికి పెద్దపీట

- గడప గడపకు విశేష స్పందన
- ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణకు ఘన స్వాగతం



వర్షంలోనూ లబ్ధిదారునికి సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



ఇంజరిలో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

గూడెంకొత్తవీధి: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ధారకొండ సచివాలయం పరిధిలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా పెట్రాయి, పెదగంగవరం, చిన గంగవరం, నరమామిడిగొంది, రోలుగుంట, తోట నగరం, చెక్కలమద్ది, నిమ్మచెట్టు తదితర గ్రామాల్లో 285 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం మన్యంలో ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని సీఎం జగనన్న అమలుచేశారన్నారు. మ్యానిఫెస్టోను పూర్తిగా అమలు చేసింది ఈ ప్రభుత్వం ఒక్కటేనన్నారు. పార్టీలకతీతంగా పారదర్శంగా అన్ని వర్గాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేస్తోందన్నారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. కార్యక్రమం అనంతనం పెట్రాయి నుంచి ఒడిశా సరిహద్దు వరకు నిర్మించనున్న రోడ్డు పనులకు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి శంకుస్థాపన చేశారు. మిషన్ కనెక్ట్ పాడేరులో భాగంగా అనేక మారుమూల ప్రాంతాల్లో రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. మన్యాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నా ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు. ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచ్‌లు కమలమ్మ, దుర్గ, వంశీకృష్ణ, రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, సర్పంచ్ ఎస్ రాజు, ఎంపీటీసీ సభ్యులు రామన్న, సత్యనారాయణ, నాగమణి, సాంబమూర్తి, వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు గిరిప్రసాద్, రామరాజ్, మోహన్‌రావు, అంజి, లోవరాజు, సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్, మత్స్యరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో శివారు గ్రామాలు

పెదబయలు: గిరిజన గ్రామాలకు మెరుగైన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శివారు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలం అతిమారుమూల మావోయిస్టుల ప్రాభల్య ప్రాంతంగా ఉన్న ఇంజరి పంచాయతీలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఇంజరి, కనుసులమెట్ట, తల్లాబు, గిన్నెగరువు గ్రామాల్లో 191 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ఇంజరి పంచాయతీకి నాలుగేళ్ల క్రితం వరకు కాలికడక, గుర్రాలపై ప్రయాణం చేసేవారని, నేడు మండలంలో గుల్లేలు నుంచి ఇంజరి పంచాయతీ కేంద్రం వరకు సుమారు రూ.17 కిలోమీటర్లు రూ.16 కోట్లతో తారురోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. అటవీ శాఖ అనుమతి వల్ల కొంత జాప్యం జరిగిందని, బొయితిల నుంచి జక్కం, ననుబరి మీదుగా కేంద్రం తారురోడ్డు పనులు జరుగుతున్నాయని, రెండు రోడ్లకు అటవీ శాఖ అనుమతులు వచ్చాయని వర్షాలు తగ్గితే పనులు ప్రారంభమవుతుందన్నారు. ఎన్నడూ లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు నేరుగా గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా అందిస్తున్నట్టు చెప్పారు. ఇంజరి పంచాయతీకి ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ రావడం ఆనందంగా ఉందని మొదటిసారి మా పంచాయతీ వచ్చిన ఎమ్మెల్యే మీరే అన్ని మహిళలు. ఇంజరి వాసులు ఆనందం వ్యక్తం చేశారు. మా సమస్యలు చెప్పుకోవడానికి మేము మండల కేంద్రానికి వెల్లడం జరిగిందని నేడు మా సమస్యలు తెలుసుకోవడానికి ఎమ్మెల్యే మా ఇంటికి రావడం ఎంతో ఆనందంగా ఉందని మహిళలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానికులు హారుతులిచ్చి ఘన స్వాగతం పలికారు. పలు సమస్యలను గ్రామస్తులు తెలియజేయగా, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పాల్గుణ హామీ ఇచ్చారు.

గతంలో పింఛన్ కోసం 15 కిలోమీటర్ల కాలినడకన.. నేడు ఇంటికే పింఛన్

గత టీడీపీ హయాంలో రోడ్డు లేక 15కిలోమీటర్ల దూరంలో ఉన్న బొంగరం, చీకుపనస, కుమడ ప్రాంతాలకు కాలినడనక వెళ్లివారమని, అయినా పింఛన్ అందుతుందో లేదో తెలియని పరిస్థితి ఉండేదని పలువురు లబ్ధిదారులు చెప్పారు. నేడు జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దకే ఒకటో తేదీ నాడు వలంటీర్లు పింఛన్ అందజేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, తహసీల్దార్ కృష్ణారావు, రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లంగి ఉమామహేశ్వరరావు, గంగాభవాని, సర్పంచ్‌లు రమణమ్మ, ఎంపీటీసీలు సత్యవతి, నిర్మల, నాయకులు ఆనందరావు, సూరయ్య, సింహాచలం, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

వీఆర్ పురం/చింతూరు: చింతూరు, వీఆర్ పురం, కూనవరం మండలాల్లో ఎమ్మెలే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు గురువారం పర్యటించనున్నట్టు నాయకులు రామలింగారెడ్డి, గోపాల్, మరియాదాసులు ప్రకటనలో తెలిపారు. చింతూరు ఎంపీడీవో కార్యాలయంలో దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరుచేసిన ట్రైసైకిళ్లను అందజేస్తారని, అనంతరం వీఆర్ పురం మండల కేంద్రంలోని మినీ గురుకులంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలవరం నిర్వాసితులకు గృహ పట్టాలు, గిరిజన రైతులకు డీకేటీ పట్టాలు, కొత్త పింఛన్లు అందజేస్తారన్నారు. అనంతరం కూనవరం మండలంలో 3 గంటలకు సచివాలయ కన్వీనర్ల సమీక్ష సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, జీసీఎస్ మండల ఇన్‌చార్జిలు తరలిరావాలని వారు కోరారు.

ఎటపాక: మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు నెల్లిపాక గ్రామంలో జరగనున్న కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని, అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు టీపీ వీడు గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

కోటవురట్ల: వరాహనది నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టరులో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ నారాయణరావు తెలిపిన వివరాల ప్రకారం గొట్టివాడ–పందూరు రహదారిలో ఇసుకతో తరలిపోతున్న ట్రాక్టరును బుధవారం పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

గ్రామాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్

రాజవొమ్మంగి: ప్రతి సచివాలయంలో పరిధిలో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు కోరారు. ఈనెల 31తేదీ వరకు డ్రైవ్ కొనసాగుతోందన్నారు. డ్రైవ్‌లో భాగంగా ఆధార్‌లోని అడ్రస్సు, పేర్లలో మార్పు తదితర సేవలందిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు 6– 10వ తేదీ వరకు శరభవరం, గడు ఓకుర్తి సచివాయాల్లో, 11 నుంచి 18 వరకు జడ్డంగి, లబ్బర్తి సచివాలయాల్లో, 19 నుంచి 25 వరకు చెరకుంపాలెం, కింద్ర సచివాలయాల్లో, 26 నుంచి 30 వరకు అమీనాబాద్, బడదనాంపల్లిలలో, అక్టోబర్ 2 నుంచి 10 వరకు వంచంగి, రాజవొమ్మంగి–2, 11 నుంచి 18 వరకు చికిలింత, రాజవొమ్మంగి–1లో 19 నుంచి 25 వరకు వాతంగి, తంటికొండ సచివాలయాల్లో, 26 నుంచి 31వ తేదీ వరకు లోదొడ్డి, దూసరపాములలో ఈ ఆధార్ డ్రైవ్‌లు కొనసాగుతాయన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



సూదిమెట్టలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ మత్స్యలింగం

హుకుంపేట: మండలంలోని పాతకోట పంచాయితీ సూదిమెట్ట గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం పర్యటించారు. ఈ నేపథ్యంలో జెడ్పి నిధులతో మంజురైన డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జిల్లా పరిషత్ నిధులు రూ.15 లక్షలతో డ్రైనేజీ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందన్నారు. పాటి లక్ష్మి, ఉప సర్పంచ్ కొండబాబు, నాయకులు బొంజుబాబు, చిన్నయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క సచివాలయ కన్వీనర్లు పనిచేయాలని సచివాలయం మండల కన్వీనరం ఎల్.కల్యాణం, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్. మత్స్యకొండం పిలుపు నిచ్చారు. మండలంలోని 18 సచివాలయాలకు చెందిన 54 కన్వీనర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్క కన్వీనర్ వారికి నిర్దేశించిన ప్రాంతాల్లో గృహ సారధులతో కలిసి పనిచేయాలన్నారు. పార్టీ కన్వీనర్లు బీమా సదుపాయం కల్పించిందన్నారు. మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చేలా శక్తి వంచనలేకుండా పనిచేయాలన్నారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, సర్పంచ్‌రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు విజయకుమారి, సన్యాసిదొర తదితరులు పాల్గొన్నారు.

రంగులు వెలసిన సూచిక బోర్డులు



ములియగుడ సమీపంలోని రంగులు వెలసి కన్పించని సూచిక బోర్డు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలను సూచిస్తూ పర్యాటకశాఖ ఆధ్వర్యంలోని సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.. అయితే కొన్నిచోట్ల బోర్డులు రంగులు వెలసి ఉండగా, మరికొన్నిచోట్ల పూర్తిగా స్తంభాలు మాత్రమే దర్శనిమిస్తున్నాయి. సూచిక బోర్డులు సక్రమంగా లేకపోవడంతో పర్యాటక ప్రదేశాల వివరాలు తెలియక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకశాఖ అధికారులు స్పందించి, సూచికబోర్డులు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, పర్యాటకులు కోరుతున్నారు.

కృష్ణావతారంలో వేంకటేశుడు



కశింకోట: స్థానిక శివాలయం వద్ద వెలసిన ధ్యాన వేంకటేశ్వరస్వామి కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుని అవతారంలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. చేత పిల్లన గ్రోవి పట్టుకున్న కృష్ణుని అవతారంలో అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



వనుగుమ్మలో గర్భిణికి పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి



చిత్రాలగోప్పలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న కేవీకే విజ్ఞాన శాస్త్రవేత్త దివ్య సుధ

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి బుధవారం సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషన్ కిట్‌లను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషణ్ కిట్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సూరమ్మ, రాధిక, మైన తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: మండలంలో చిత్రాలగోప్పులో బుధవారం జరిగిన కార్యక్రమంలో పోషకాహారం ఆవశ్యకతపై హరిపురం కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త బి.దివ్య సుధ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడానికి పౌష్టికాహారం ఎంతగానో దోహదపడుతుందన్నారు. పోషకాహారం తీసుకోవడం వలన వ్యాది నిరోధక శక్తి పెరుగుతుందని, ఆరోగ్యవంతంగా ఉండచ్చన్నారు. ఆహారంలో ప్రోటీన్లు, కార్‌బోహైడ్రేట్‌లు, విటమిన్‌లు, మినరల్స్ ఉండేలా చూసుకోవాలని సూచించారు.

'బజాజ్' ప్రాంగణ నియామకాలు



ఇంటర్వ్యూ చేస్తున్న బజాజ్ కంపెనీ హెచ్‌ఆర్‌లు మహేష్, నాయుడు

అనకాపల్లిటౌన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా స్థానిక దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాల ఆవరణలో బజాజ్ మోటార్ కార్ప్ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్ తెలిపారు. కళాశాల ఆవరణలో బుధవారం 100 మంది నిరుద్యోగులకు ఉద్యోగ పరీక్షల అనంతరం, ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అనకాపల్లి, పరవాడ, సబ్బవరం, పాడేరు, మాకవరం, నర్సీపట్నం, చోడవరం, యలమంచిలి, అరకు ప్రాంతాల్లో పనిచేసేందుకు త్వరలో నియామకపత్రాలను అందిస్తామన్నారు. బజాజ్ మోటార్ కార్ప్ హెచ్‌ఆర్‌లు బి.మహేష్, డి.నాయుడులు ఇంటర్వ్యూలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌ఐ మాధురి, అధ్యాపకులు కె.రాజేష్, ఎస్.ఆర్.జమీర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భోత్పత్తి ఇంజక్షన్లతో ఆడ పెయ్యిల జననం



పశువుల పెంపకంలో జాగ్రత్తలను వివరిస్తున్న పశువైద్యాధికారి నాయుడు

కె.కోటపాడు : ఏడాదికి ఒక దూడ జన్మించేలా పాడిపశువుల సంరక్షణలో రైతులు జాగ్రత్తలను తీసుకోవాలని కొరువాడ పశువైద్యాధికారి సీహెచ్.వై.నాయుడు తెలిపారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా బుధవారం పాడి రైతులకు ఆయన పశుపెంపకంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కృత్రిమ గర్భోత్పత్తి ఇంజక్షన్‌ల ద్వారా ఆడపెయ్యిలను జన్మించేందుకు కావాల్సిన వీర్యాన్ని ప్రభుత్వం తక్కువ ధరకే అందిస్తున్నట్టు తెలిపారు. రెండు డోసుల వీర్యానికి రైతులు రూ.500లు చెల్లించాలన్నారు. ఈ విధానం ద్వారా 90 శాతం ఆడపెయ్యిలు జన్మించనున్నట్టు చెప్పారు. ప్రస్తుత సమయంలో వాతావరణం పాడి పశువులు చూడికట్టేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. 60 శాతం రాయితీపై రైతులకు సమీకృత దాణా(టీఎంఆర్)ను ఇవ్వనున్నట్టు పశువైద్యాధికారి నాయుడు వివరించారు. ఆరోగ్య జాగ్రత్తలను పాటించి, పాడి ద్వారా మంచి ఆదాయాన్ని పొందాలని రైతులకు పశువైద్యాధికారి సీహెచ్.వై.నాయుడు తెలిపారు.

విస్తారంగా కర్రపెండలం సాగు



దాలివలసలో కర్రపెండలం పంట

కె.కోటపాడు : మండలంలోని పలు గ్రామాల్లో కర్రపెండలం పంటను విస్తారంగా సాగుచేస్తున్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంత గ్రామాలైన గరుగుబిల్లి, గొండుపాలెం, దాలివలస, కొరువాడ, గుల్లేపల్లి, డి.అగ్రహారం, పింద్రంగి, ఎరకన్నపాలెం, ఆర్లి, చింతపాలెంలలో 300 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఈ పంటకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మేలు చేస్తాయి. మెట్ట ప్రాంత గ్రామాల్లో గల భూములు కర్రపెండలం పంటకు అనుకూలంగా ఉండడంతో పాటు పంట దిగుబడి అధికంగా ఉంటుందని రైతులు తెలిపారు. మరో ఇరవై రోజుల అనంతరం దుంపలను తీయనున్నట్టు వారు చెప్పారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

ఎస్.రాయవరం : చిన్నారుల్లో వ్యాధి నిరోధిక శక్తిని పెంచితే రోగాలు దరి చేరకుండా ఉంటాయని హెల్త్ విజిటర్ నాగరత్నం అన్నారు. కొరుప్రోలు వెల్‌నెస్ కేంద్రంలో బుధవారం చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులకు ఆరోగ్య విలువలపై అవగాహన కల్పించారు. బాలింతలు, చిన్నారులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరివేణి, ఏఎన్ఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



పూజలు చేస్తున్న చిన్నారులు



కుజ్జెలిలో పూజలు చేస్తున్న భక్తులు



వీఆర్ పురంలో చిన్నికృష్ణుడు, రాధ వేషధారణలో చిన్నారులు







చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

సాక్షి, పాడేరు: కృష్ణాష్టమి వేడుకను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. అరకులోయలోని శరభగుడ,హుకుంపేట మండలంలోని గడుగుబిల్లి,పాడేరు మండలంలోని కుజ్జెలి గ్రామాలలోని శ్రీకృష్ణుని ఆలయాల్లో గిరిజనులు ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీకృష్ణుడి ప్రధాన విగ్రహంతో పాటు, మట్టి విగ్రహలను కొలువుదీర్చారు. అన్నసమారాదన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాడేరులోని పలు విద్యాలయాలు, గిరిజన గ్రామాల్లో చిన్నారులు చిన్ని కృష్ణుని వేషధారణలో అలరించారు. కుజ్జెలిలో జరిగిన వేడుకలో సర్పంచ్ చిట్టిబాబు,ఎంపీటీసీ నరసింహమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: మండంలో పలు ప్రాంతాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.పిల్లలు కృష్ణుడు వేషాదారణ ధరించారు.సాయంత్రం సమయంలో స్థానిక కృష్ణుడి ఆలయం వద్ద ఉట్టిని కోట్టారు.

అడ్డతీగల: అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో బుధవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆద్వర్యంలో పూరి జగన్నాథుని విగ్రహానికి పూజలు నిర్వహించారు. కృష్ణాష్టమి ప్రాశస్త్యాన్ని బాలలకు వెంకటరామయ్య వివరించారు. సదానంద గురుదేవులకు పూజాధికాలు గావించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

ముంచంగిపుట్టు: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కుమ్మరిపుట్టులో శ్రీకృష్ణుని ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి, భజనలు చేశారు. సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంప్‌లో సీఆర్‌పీఎఫ్ పోలీసులు శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కొయ్యూరు: సింగవరంలో బుధవారం కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న సమరాధన ఏర్పాటు చేశారు.

వీఆర్ పురం: మండలంలోని రాజీవ్‌గాంధీ సెంటర్, పెట్టవీధి, రామాలయం సెంటర్, రేఖపల్లి, గొల్లగుడెం, వడ్డిగుడెం, రాజుపేట తదితర ప్రాంతాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. యువకులు, చిన్నారులకు ఉట్టికొట్టే వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.

రాజవొమ్మంగి: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారుల వేషధారణ ఆకట్టుకుంది. స్థానిక శ్రీకృష్ణుని ఆలయం వద్ద గురువారం ఉట్టుకొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి తెలిపింది.



రాజవొమ్మంగిలో చిన్నికృష్ణుడు వేషధారణలో చిన్నారి

నేడు మరిడిమాంబ అమ్మవారి పండగ

మునగపాక : మండలంలోని రెండు గ్రామాల్లో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండుగలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. నాగులాపల్లి, తిమ్మరాజుపేట గ్రామాల్లో ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు. అదేరోజు ఆయా గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరుతున్నారు.

పాడి రైతులకు గడ్డి కోత యంత్రాల అందజేత



కొత్తపల్లిలో గడ్డి కోత యంత్రాల పత్రాలతో రైతులు, పశువైద్యాధికారి అల్ఫాన్సా జార్జి

కశింకోట: పాడి రైతులకు గడ్డి కోత యంత్రాలు ఎంతో ప్రయోజనకరమని కశింకోట పశు వైద్యాధికారి అల్ఫాన్సా జార్జి అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో ఐదుగురు పాడి రైతులకు రాయితీపై మంజూరైన గడ్డి కోత యంత్రాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడ్డి కోత యంత్రాలను 40 శాతం రాయితీపై ప్రభుత్వం పాడి రైతులకు అందిస్తోందన్నారు. ఈ యంత్రంతో గడ్డిని ముక్కలుగా కోసి మేతగా వేయడం ద్వారా పశువులు పూర్తిగా తింటాయని, పశుగ్రాస వృధాను అరికట్టవచ్చన్నారు. పాల దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. పశువులకు అంగుళం సైజులో ఎండు గడ్డిని కోసి మేతగా అందిస్తే పాలలో వెన్న శాతం పెరుగుతుందన్నారు. ఎన్నో ప్రయోజనాలున్న గడ్డి యంత్రాన్ని రాయితీపై రూ.20,382కు ప్రభుత్వం అందిస్తోందన్నారు. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామ్, వైఎస్సార్ సీపీ నాయకుడు అద్దెపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు



గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో కుక్కలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.నాలుగు రోడ్ల కూడలి, సంతబయలు,పోలీసు స్టేషన్ జంక్షన్, ఇందిరా కాలనీలలో గుంపులుగా సంచరిస్తూ పాదచారులపై, వాహనచోదకులపై దాడికి పాల్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో రోడ్ల మీదకు రావాలంటేనే కుక్కల భయం పట్టుకుంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.